





# యాదగిరిగుట్ట టెంపుల్ కు ఎస్బీఐ రెండు బ్యాటరీ వాహనాలు అందజేత

### ఆలయానికి రూ.16 లక్షల విలువైన రెండు బ్యాటరీ వాహనాలు అప్పగింత

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు సెట్టి రెండు బ్యాటరీ వాహనాలను అందజేశారు. సోమవారం ఫ్యామిలీతో కలిసి యాదగిరిగుట్టకు వచ్చిన ఆయన.. బ్యాటరీ వాహనాలకు సంబంధించిన తాళంచెవిలను ఆలయ ఈవో భాస్కర్ రావు అందజేసి బ్యాటరీ వాహనాలను ఆలయానికి అప్పగించారు. అనంతరం ఈవో భాస్కర్ రావుతో కలిసి బ్యాటరీ వాహనాలకు జెండా ఊపి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారుగా ఒక్కోటి రూ.8 లక్షలు విలువ చేసే రెండు బ్యాటరీ వాహనాలను(రెండు కలిపి రూ.16 లక్షలు) ఎస్బీఐ తరపున దేవస్థానానికి విరాళంగా అందజేశామని ఎస్బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు సెట్టి తెలిపారు. భవిష్యత్తులో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద విరాళాలు అందించడంలో యాదగిరిగుట్ట ఆలయానికి ఫస్ట్ ప్రయారిటీ ఇస్తామన్నారు. ఎస్బీఐ అందజేసిన బ్యాటరీ వాహనాలను దివ్యాంగులు, వృద్ధుల సేవలకు వినియోగిస్తామని ఆలయ ఈవో భాస్కర్ రావు తెలిపారు. అంతకుముందు ఆయన కుటుంబంతో కలిసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఈవో భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు.



# యాదగిరిగుట్టలో వైభవంగా 'సామూహిక గిరిప్రదక్షిణ'

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా.. సోమవారం దేవస్థానం ఆధ్వర్యంలో 'సామూహిక గిరిప్రదక్షిణ' కార్యక్రమాన్ని చేపట్టారు. తెల్లవారుజామున ఉదయం 5:30 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద భక్తులతో కలిసి ఆలయ ఈవో భాస్కర్ రావు నారసింహుడి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసి గిరిప్రదక్షిణ ఆరంభించారు. గిరిప్రదక్షిణలో భాగంగా భక్తులు రెండున్నర కిలోమీటర్ల కొండ చుట్టూ కాలినడకన ప్రదక్షిణలు చేశారు. అనంతరం కొండపైకి చేరుకుని గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు దేవస్థాన ఆఫీసర్లు ప్రత్యేక దర్శనం సదుపాయం కల్పించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. గిరిప్రదక్షిణలో భాగంగా కొందరు



భక్తులు భజన, నృత్య బృందాలు చేసిన భజనలు, భక్తిగీతాలు, కీర్తనలు, సంకీర్తనలు, నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరించారు.




#### శాస్త్రోక్తంగా 'అష్టోత్తర శతఘటాభిషేకం'

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అష్టోత్తర శతఘటాభిషేక కైంకర్యాన్ని ఆలయ అర్చకులు అట్టహాసంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామిఅమ్మవార్లకు శతఘటాభిషేకాన్ని ఘనంగా చేపట్టారు. ఉత్సవంలో భాగంగా.. ప్రధానాలయ ముఖ మంటపంలో, గర్భగుడికి అభిముఖంగా, స్వర్ణ ధ్వజస్తంభానికి ఎదురుగా శుద్ధ జలంతో కూడిన 108 వెండి కలశాలను వరుసగా పేర్చి వేదపండితుల మంత్రోచ్ఛారణలు, పారాయణీకుల పారాయణాలు, యాజ్ఞీకులు, రుత్వికుల మూలమంత్ర, మూర్తిమంత్ర హోమాలు, జపాల మధ్య, మంగళ వాయిద్యాల హోరు నడుమ కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 108 కలశాల్లో ఉన్న మంత్రజలంతో స్వామివారికి అర్చనాభిషేకాలు నిర్వహించారు.

# అంబేద్కర్, జార్జిరెడ్డిల స్ఫూర్తిని కొనసాగిద్దాం

## పి డి ఎస్ యు, పి వై ఎల్, పి ఓ డబ్ల్యు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రపంచం గర్వించదగిన మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి మరియు ఉస్మానియా అరుణతార పిడిఎస్ యు వ్యవస్థాపకుడు, యువ మేధావి కామ్రేడ్ జార్జిరెడ్డి 53వ వర్ధంతి యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో నిర్వహించారు. "జీనా హైతో మర్నాసికో – కదం కదం ఫర్ లడ్నా సికో" సేవ్ ఇండియా – సేవ్ కాన్స్టిట్యూషన్" నినాదాలతో జరిగింది. సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ మాట్లాడుతూ... డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఉస్మానియా అరుణతార జార్జిరెడ్డిలు దేశంలో అసమానతలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. హిందూమతంలోని ఫాసిస్టు విధానాలను, మూఢనమ్మకాలను వ్యతిరేకించారనీ, తరతరాలుగా సాంప్రదాయాలు, కట్టుబాట్ల పేరిట దళిత, బహుజనులను విద్యకు దూరం చేసిన అగ్రకుల బ్రాహ్మణీయ సాంస్కృతికి వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. అంబేద్కర్ జార్జిరెడ్డిలు ఇద్దరూ కూడా హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా మానవీయ విలువల కోసం పోరాటాలు చేశారని అన్నారు. అనేక అవమానాలను ఎదుర్కొని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశంలోని అట్టడుగు వర్గాల వెనుకబడిన దళిత, బహుజన అభివృద్ధి కోసం ఉన్నత చదువులు చదివి భారత రాజ్యాంగాన్ని నిర్మించాడని తెలిపారు. కామ్రేడ్ జార్జిరెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో మనువాద శక్తుల అరాచక ఆధిపత్యాన్ని ఎదిరించి, అణగారిన వర్గాల విద్యార్థులకు బిగిపిడికిలి జెండాను అందించాడని, జార్జి రెడ్డి ఇచ్చిన "జీనా హైతో మర్నాసికో– కదం కదం పర్ లడ్నాసికో" నినాదం యావత్ విద్యార్థి




లోకాన్ని తట్టి లేపిందని, ప్రగతిశీల విద్యార్థి ఉద్యమానికి పునాదులు వేసిందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల ప్రభావంతో, శ్రీకాకుళం, నక్సల్బరి, గోదావరి లోయ, ప్రతిఘటన పోరాటాల ప్రేరణతో కామ్రేడ్ జార్జిరెడ్డి నాయకత్వాన 1972లో ఉస్మానియా యూనివర్సిటీలో పిడిఎస్ పురుడు పోసుకున్నదని తెలిపారు. పిడిఎస్ యు తెలుగు నేలపై అనేకమంది విప్లవ విద్యార్థి, యువ మేధావులను తయారు చేసిందని తెలిపారు. కామ్రేడ్ జార్జి రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలకు వ్యతిరేకంగా, మతోన్మాద ఫాసిస్టు పరివారశక్తుల ఆగడాలకు వ్యతిరేకంగా ప్రగతిశీల విద్యార్థి సంఘాన్ని స్థాపించాడని అన్నారు. కామ్రేడ్ జార్జి రెడ్డి విద్యాసంస్థల్లో భూస్వామ్య హిందుత్వ భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడని, జార్జిరెడ్డిని ఏ విషయంలోనూ ఎదుర్కోలేని ఏబీవీపీ మతోన్మాద కిరాయి గుండాలు అంబేద్కర్ జయంతి రోజే ఉస్మానియా విశ్వవిద్యాలయం లో అత్యంత కిరాతకంగా కత్తులతో పొడిచి 1972లో ఏప్రిల్ 14న హత్య చేసి వికృతానందం పొందారని అన్నారు. జార్జి మిత్రులు పిడిఎస్ సంస్థను తెలుగు నేలంతా విస్తరింపజేసి అన్ని విద్యాలయాలను విప్లవ ప్రాంగణాలుగా మార్చి పిడిఎస్ యు విప్లవ విద్యార్థి చరిత్రను మరింత ఎరుపెక్కించారని కొనియాడారు. జార్జి రెడ్డి అందించిన స్ఫూర్తితో జంపాల, శ్రీపాద శ్రీహరి, చేరాలు, వరహాలు, సాంబయ్య, మధుసూదన్ రాజ్, మారోజు వీరన్న, రంగవల్లి లాంటి ఎందరో మెరికల్లాంటి విద్యార్థి నాయకులు ప్రజా ఉద్యమంలోకి అడుగు పెట్టారని అన్నారు. నేడు దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యను పూర్తిగా కాషాయకరించిందని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం లోని ప్రజా హక్కులను, చట్టాలను ఖూనీ చేసిందని తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టే ప్రభుత్వరంగ సంస్థలను, బహుళ జాతి, కార్పోరేట్ సంస్థలకు మోడీ ప్రభుత్వం కట్టబెట్టిందని అన్నారు. దేశభక్తి, హిందుత్వం ముసుగులో దేశ వనరులను, సహజ సంపదలను దళారులకు అమ్మి వేస్తుందని తెలిపారు. తాజాగా మోడీ ప్రభుత్వం కన్ను అడవులపై పడిందని, 2026 మార్చి 31 నాటికి అడవులను అదాని కి అప్పగించడం కోసం అత్యంత క్రూరంగా ఆపరేషన్ కగారు పేరుతో అడవిలో ఉన్న ఆదివాసీలను హననం చేస్తుందని దుయ్యబట్టారు. లక్షల కోట్ల రూపాయలు కార్పోరేట్ సంస్థలకు రాయితీ ఇస్తూ, దేశ ప్రజలపై తీవ్రమైన పన్నుల భారాన్ని మోపుతున్నదని అన్నారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మోడీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, ప్రాచీన భారత రాజ్యాంగం పేరుతో మనుస్మృతిని తిరిగి తెరపై తీసుకురావడానికి, భారత రాజ్యాంగాన్ని బలహీన పరుస్తున్నదని తెలిపారు. ఈ విధానాలపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జార్జ్ రెడ్డి లు అందించిన స్ఫూర్తితో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు ముక్తకంఠంతో నిరసించాలని, అగ్రకుల బ్రాహ్మణీయ, ఫాసిస్టు, మతోన్మాద విధానాల పట్ల ప్రజలు అప్రమత్తమై బిజెపి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు బేజాడి వినోద, మహంకాళి, పిడిఎస్ యు ,బి ఆజాద్ ,స్ఫూర్తి ,భాను, రశ్మిత చిన్నారి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

